జాగ్రత్తలు తప్పనిసరి: మంత్రి అచ్చెన్న

అరసవల్లి, సెప్టెంబరు 9: భారీ వర్షాల నేపథ్యంలో వినాయక నిమజ్జనోత్సవాల్లో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం విజయవాడ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులు, ఎమ్మెల్యేలతో అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు. వర్షాల కారణంగా ఎటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా.. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

వర్షాలు తగ్గినా.. అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 9: వర్షాలు తగ్గుముఖం పట్టినా, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఒడిశాలో ఇంకా వర్షాలు కురుస్తున్నాయని, జిల్లాలోని నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాలతో జిల్లాలో కొద్దిపాటి నష్టం వాటిల్లిందని తెలిపారు. 'రహదారులకు 20 చోట్ల అంతరాయం కలుగగా, ఇప్పటికే 10చోట్ల పునరుద్ధరించాం. 43 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రెండు చెరువుల్లో లీకేజీ ఉండగా వాటిని పూడ్చాం. పాడైన రెండు ట్రాన్స్‌ఫార్మర్‌లను పునరుద్ధరించారు. 11 విద్యుత్తు స్తంభాలు పడిపోగా వాటిని సరిచేశారు. ఎల్ఎన్‌పేటలో చెక్‌డ్యాం సైడ్ వాల్ దెబ్బతింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా 42 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశాం. గొర్రెలు-7, ఎద్దు-1 మృతి చెందాయి. 44మంది గర్భిణులను ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాం. 152 వైద్యశిబిరాలు నిర్వహించామ'ని కలెక్టర్ తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.అప్పారావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పాల్గొన్నారు.

ఉగ్రరూపం దాల్చిన రెల్లిగెడ్డ

పొందూరు: పొందూరు మండలంలో రెల్లిగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. లైదాం గ్రామం వద్ద వంతెనపై వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సంతకవిటి, పొందూరు మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెల్లిగెడ్డ పరీవాహక గ్రామాలైన లైదాం, గోరింట, గోర్లపల్లి, తాడివలస, మొదలవలస, బొడ్డేపల్లిలో వందలాది ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. అలాగే మొదలవలస వద్ద వంతెనపై వరదనీరు ప్రవహిస్తోంది.



పొందూరు : లైదాంలో నీటమునిగిన వరిపంట పొలాలు

ముంచేసింది

పూరీ వద్ద తీరం దాటిన తుఫాన్

ఒడిశా రాష్ట్రం పూరీ వద్ద సోమవారం ఉదయం తుఫాన్ తీరం దాటింది. మధ్యాహ్నం నుంచి కాసింత తెరిపి ఇచ్చినట్లయింది. వర్షపాతం పెద్దగా ఎక్కడా నమోదు కాలేదు. దీంతో జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సాయంత్రం నుంచి హైవేపై వాహనాల రాకపోకలు ఊపందుకున్నాయి.

- తుఫాన్ ప్రభావంతో తీవ్ర నష్టం
- 2,705 ఎకరాల్లో వరి పంట ముంపు
- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా
- సర్వే జరిపితేనే మరింత కచ్చితత్వం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం.. తుఫాన్‌గా మారి.. జిల్లాలో శనివారం నుంచి సోమవారం వేకువజాము వరకు భారీ వర్షం కురిసింది. సిక్కోలు అంతటా జలమయమైంది. వేలాది ఎకరాల్లో పంటలను వరదనీరు ముంచేసింది. తుఫాన్ కారణంగా రైతులకు భారీ నష్టం వాటిల్లింది.



ఇచ్ఛాపురం: ఈనేసుపేటలో నీటమునిగిన వరి

జిల్లావ్యాప్తంగా 2,705 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్టు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. జలుమూరు, పోలాకి, పొందూరు మండలాల్లో అత్యధికంగా వరి పంట ముంపునకు గురైనట్లు నిర్ధారించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో బీల భూముల్లో నీరు చేరి... వేలాది ఎకరాల్లో పంటపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. వరి పంటతోపాటు.. ఉద్యానవన పంటలు నీట మునిగాయి. అధికారుల బృందం గ్రామస్థాయిలో.. వంశధార సాగునీటి కాలువల పరిధి గ్రామాల్లో సర్వే నిర్వహిస్తే పంట నష్టం అంచనాలో కచ్చితత్వం ఉంటుంది. ప్రస్తుతం తుఫాన్ తీరం దాటడంతో మరో రెండు రోజుల్లో పంట నష్టాన్ని అంచనా వేయనున్నారు. అలానే ఉద్దానంలో కొబ్బరి, మామిడి, అరటి, ఇతర ఉద్యానవన పంటల నష్టాలపై నివేదికను సిద్ధం చేస్తున్నారు. పంట నష్టంతోపాటు.. ప్రజలకు, ప్రజల ఆస్తులకు సంభవించిన నష్టంపై సమగ్రంగా నివేదికను సిద్ధం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. జిల్లా అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా.. శ్రీకాకుళం రూరల్, మెళియాపుట్టి, కవిటి, కంచిలి, జలుమూరు, సారవకోట, రణస్థలం మండలాల్లో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పాతకాలం నాటి ఇళ్ల గోడలు కూలిపోయాయి. లావేరు మండలంలో గెడ్డల ఉధృతికి రహదారులపై భారీగా వరదనీరు ప్రవహించింది.

ప్రాజెక్టులు కళకళ

జిల్లాలో వర్షాలతోపాటు ఒడిశా నుంచి వస్తున్న వరదల కారణంగా మహేంద్రతనయ, బహుదా, నాగావళి, వంశధార నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టుల విషయానికొస్తే.. గొట్టాబ్యారేజీ నుంచి గేట్లను ఎత్తివేసి 11,553 క్యూసెక్కుల నీటిని వంశధార నదిలోకి విడిచిపెట్టారు. ఒడిశా నుంచి నేరుగా ప్రాజెక్టులోకి 11,553 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. అదేనీటిని బయటకు పంపుతున్నారు. నారాయణపురం ఆనకట్టలోకి 13,500 క్యూసెక్కుల నీరు చేరుతుండగా.. గేట్లను ఎత్తివేసి నాగావళి నదిలోకి 13,500 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టేస్తున్నారు. మడ్డువలస రిజర్వాయర్‌లో 65 మీటర్లు నీరు నిల్వ ఉండేలా చూసుకుంటూ అదనంగా ఉన్న 8,040 క్యూసెక్కుల వరద నీటిని నాగావళి నదిలోకి విడిచిపెట్టారు. ఇక చెరువులన్నీ నిండుకుండల్లా ఉన్నాయి.



పొన్నాడ వంతెనను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

నిమజ్జనోత్సవాల్లో నిబంధనలు పాటించాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 9: 'భారీ వర్షాలతో నదులు, చెరువుల్లో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. వినాయక నిమజ్జనోత్సవాల్లో భాగంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ భద్రతా నియమాలు పాటించాలి' అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళం నగరంలోని పొన్నాడ, ఏడురోడ్ల కూడలి, డేఅండ్ నైట్ కూడలి సమీపంలో ఉన్న నాగావళి వంతెన ఇరువైపుల వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. భద్రతాపరమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. 'ఇతర శాఖల సమన్వయంతో ప్రతీ నిమజ్జన ప్రదేశంలో లైటింగ్స్, క్రేన్లు, ఈతగాళ్లు, లైఫ్‌బోట్లు, అంబులెన్స్, బారికేడు, అవసరమైన సిబ్బందిని ముందుగానే సిద్ధం చేసుకోవాలి. ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి. పరిమితికి మించి డీజే శబ్దాలు ఉండరాదు. నిమజ్జన వివరాలను ముందుగానే సంబంధిత పోలీసులకు చెప్పాలి. గజ ఈతగాళ్లు, క్రేన్ల సహాయంతోనే విగ్రహాలను నిమజ్జనం చేయాల'ని ఎస్పీ ఆదేశించారు. నియమాలు పాటించకపోతే నిర్వాహకులు, కమిటీ సభ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఎచ్చెర్ల : రామజోగిపేట వద్ద మునియామ్ చెరువుకు గండి

చెరువులకు గండ్లు..

ఎచ్చెర్ల/ కోటబొమ్మాళి/ నందిగాం, సెప్టెంబరు 9: జిల్లాలో వర్షాల ప్రభావంతో పలుచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. భారీగా వరదనీరు చేరి.. పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. ఎచ్చెర్ల మండలం రామజోగిపేట వద్ద మునియామ్ చెరువుకు గండి పడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులో నీరు నిండిపోవడంతో చివరన గట్టు కోతకు గురైంది. నీరు పంటపొలాల మీదుగా అధికంగా ప్రవహిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కోటబొమ్మాళి: తిలారు పెద్దచెరువుకు గండి



నందిగాం: సుభద్రాపురం పెద్దచెరువు సమీపంలో దోని వద్ద గండి

- కోటబొమ్మాళి మండలం తిలారు- గవిరమ్మపేట మధ్య గల పెద్ద చెరువు గట్టుకు సోమవారం తెల్లవారుజామున గండి పడింది. సమాచారం తెలుసుకున్న మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ.. హుటాహుటీన యంత్రాల సహాయంతో గండిని పూడ్చేశారు. గండిని మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు.
- నందిగాం మండలం సుభద్రాపురం సమీపంలో వంశధార ప్రధాన ఎడమకాలువకు ఇరువైపులా ఉన్న చెరువులకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన దోని దెబ్బతింది. పెద్దచెరువు సమీపంలో గండిపడడంతో రైతులు ఆందోళన చెందారు. గండిపడిన ప్రాంతాన్ని ఇసుక బస్తాలతో పూడ్చినప్పటికీ పెద్దచెరువు దిగువ సుమారు 800 ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోయారు. సిమెంట్ దోనిని పునఃనిర్మించాలని కోరుతున్నారు.



జలుమూరు : అల్లాడలో కూలిన గోడ



ఆమదాలవలస: వెంగలరావు కాలనీలో కూలిన మట్టిగోడ

కూలిన ఇళ్లు..

ఆమదాలవలస/ కోటబొమ్మాళి/ జలుమూరు/ లావేరు, సెప్టెంబరు 9: ఆమదాలవలస పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన బడిగంటి సావిత్రమ్మకు చెందిన పెంకిటిల్లు ఆదివారం రాత్రి కూలిపోయింది. వెనుకభాగంలో ఉన్న గది పైకప్పు పూర్తిగా కూలిపోయి ఇంటిలో ఉన్న సామగ్రిపై పడింది. ఇదే కాలనీలో అముజూరు జ్యోతి మేటికోటి సావిత్రమ్మకు చెందిన పూరిల్లు గోడలు కూలిపోయాయి. అలాగే కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురంలో సీపాద క్లేసరమ్మకు చెందిన ఇంటి గోడ పాక్షికంగా కూలిపోయింది. ఇళ్లు, గోడలు కూలిన సమయంలో ఎవరికీ ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

- జలుమూరు మండలం అల్లాడలో మొగిలిపురి శంకరరావు డాబా ఇల్లు గోడ కూలింది. శంకరరావు ఫిర్యాదు మేరకు ఆర్ఐ సతీష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తహసీల్దారు లక్ష్మీనారాయణకు నివేదిక సమర్పించారు. అలాగే సారవకోట మండలం కేలవలసకు చెందిన మచ్చల కృష్ణవేణి, బద్రిలో నెయ్యిల పార్వతికి చెందిన పూరిల్లు దెబ్బతిన్నట్టు తహసీల్దార్ విజయలక్ష్మీ తెలిపారు. లావేరు మండలం అదపాకలో బొంతల సత్యవతికు చెందిన పూరిల్లు సోమవారం కూలిపోయింది.

ముసురులో ఆర్తనాదాలు

- మతిస్థిమితం లేని మహిళకు పురిటినొప్పులు
- స్పందించి సపర్యలు చేసిన ఆశ కార్యకర్త
- 108 వాహనంలో మగబిడ్డ జననం
- పోలీసుల సహాయంతో ఆస్పత్రిలో చేరిక



పుట్టిన మగబిడ్డ

నరసన్నపేట, సెప్టెంబరు 9: నరసన్నపేట మండలం కోమర్తి కాలనీ అంగన్‌వాడీ భవనం వద్ద.. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో ఓవైపు హోరుగాలి.. మరోవైపు జోరువాన కురుస్తోంది. ఆ సమయంలో ఓ మహిళ ఆర్తనాదాలు వినిపించాయి. స్థానిక ఆశ కార్యకర్త సరస్వతి వెళ్లి చూడగా.. మతిస్థిమితం లేని ఓ మహిళ పురిటినొప్పులతో బాధపడుతున్నట్లు కనిపించింది. వెంటనే ఆమె స్పందించి స్థానికుల ద్వారా 108 అంబులెన్స్‌కు, పోలీసులకు సమాచారం ఇచ్చింది. ఇంతలో సపర్యలు చేసింది. అంబులెన్స్ రాగా.. అందులో మహిళకు ప్రాథమిక చికిత్స చేయగా.. పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆ రాత్రివేళ తల్లీబిడ్డను పోలీసుల సాయంతో సామాజిక ఆస్పత్రికి తరలించగా వైద్య సేవలు అందజేశారు. కాగా.. 8 నెలలకే ప్రసవం జరగడంతో పుట్టిన బిడ్డ బరువు తక్కువగా ఉందని, మూడు రోజుల పాటు చికిత్స అందజేయాల్సి ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్‌బాబు తెలిపారు. మెరుగైన చికిత్స కోసం ఆ చిన్నారి సోమవారం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించారు. వర్షం కురుస్తున్నా రాత్రివేళ స్పందించి సేవలు అందించిన ఆశ కార్యకర్త సరస్వతిని స్థానికులు అభినందించారు.

- ఇదిలా ఉండగా నవజాతి శిశువును తమకు అప్పగించాలని జిల్లా బాలలు సంరక్షణ అధికారులు డిమాండ్ చేశారు. మరోవైపు సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ దుర్గాప్రసాదరావు ఆస్పత్రికి చేరుకుని బాలింత మహిళను, నవజాతి శిశువును పరిశీలించారు. బాల శిశుసంరక్షణ అధికారులతో పోలీసులు మాట్లాడారు. పూర్తిస్థాయిలో కోలుకున్న తర్వాతే అప్పగిస్తామని తెలిపారు. మతిస్థిమితం లేని మహిళ పోలాకి మండలం ప్రియాగ్రహారంకు చెందిన అప్పోజీగా గుర్తించారు. చిన్నతనంలో తల్లిదండ్రులను కోల్పోవడంతో ఆమె మానసిక స్థితి సరిగా లేదని బంధువులు తెలిపారు. రెండేళ్ల కిందట కూడా ఒక మగబిడ్డకు జన్మనిచ్చిందని, అప్పట్లో సంరక్షణ చేపట్టి దత్తత కూడా ఇచ్చినట్టు జిల్లా బాలశిశు సంరక్షణ కౌన్సిలర్ డి.సీతారాం తెలిపారు. మగబిడ్డను దత్తత తీసుకునేందుకు పలువురు ఆస్పత్రి వద్దకు వచ్చారు. బాలింత బంధువులు కూడా చేరుకున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి.. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు చేపడతామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ఏటీఎంలో చోరీ యత్నం

- వైర్లు కట్ చేసిన దొంగలు
- పోలీసుల రాకతో పరుగులు

శ్రీకాకుళం క్రైం, సెప్టెంబరు 9: శ్రీకాకుళంలోని కళింగ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో నగదును చోరీ చేసేందుకు ఇద్దరు దొంగలు యత్నించారు. ఆదివారం రాత్రి వారిద్దరూ ఏటీఎం వద్దకు వచ్చారు. ఒకడు సీసీ కెమెరాల డైరెక్షన్ మార్చి లోపలకు ప్రవేశించాడు. ఏటీఎమ్‌కు ఉండే విద్యుత్ వైర్లను కత్తిరించాడు. మరొకడు పక్క సందులో కాపలా కాశాడు. ఏటీఎం లోపల ఉన్న దొంగ ఏటీఎం మిషన్ ఓపెన్ చేసేందుకు సిద్ధమవుతుండగా.. రాత్రి గస్తీలో భాగంగా ఒకటో పట్టణ పోలీసులు వాహనంలో తిరుగుతూ సైరన్ మోగించారు. ఏటీఎం వద్ద అలికిడి అవుతున్నట్టు గుర్తించి వాహనాన్ని ఆపి.. కానిస్టేబుల్ రవికుమార్ అక్కడకు వెళ్లేలోగా ఇద్దరు దొంగలూ పరారయ్యారు. ఈ విషయాన్ని సీఐ పైడపునాయుడుకు కానిస్టేబుల్ రవికుమార్ వివరించారు. సీఐ పైడపునాయుడు.. డీఎస్పీ వివేకానందకు సమాచారం అందించి.. ఏటీఎం వద్ద సిబ్బందిని కాపలా ఉంచారు. మరికొందరు చుట్టుపక్కలా దొంగల కోసం గాలించారు. సోమవారం ఉదయం సీఐ, డీఎస్పీ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ కూడా చేరుకుని వేలిముద్రలు, సీసీ టీవీ ఫుటేజీలు పరిశీలించారు.



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్

ఈ ఏడాది జనవరిలోనూ..

ఏటీఎంలో చోరీకి యత్నించిన దొంగల ముఖ చిత్రాలు అక్కడ ఉన్న సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. వాటిని పరిశీలించిన పోలీసులకు కొన్ని నిజాలు తెలిశాయి. ఏటీఎం చోరీకి పాల్పడిన దొంగ ఈ ఏడాది జనవరి 24 అర్ధరాత్రి కూడా అదే ఏటీఎం చోరీ చేసేందుకు యత్నించినట్లు పోలీసులు తమ రికార్డుల ఆధారంగా గుర్తించారు. ఈ ఘటనపై సీఐ కె.పైడపునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

జిల్లా వణుకుతోంది

- అంతటా వైరల్ జ్వరాలు
- తగ్గుతున్న ప్లేట్‌లెట్లు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

(అరసవల్లి)

జిల్లాను జ్వరాలు వణికిస్తున్నాయి. వాతావరణంలో మార్పులతో జ్వరాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాఅంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు పారిశుధ్య లోపం కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా.. చిన్నారుల నుంచి పెద్దల వరకూ వైరల్ జ్వరాలతో బాధపడుతూనే ఉన్నారు. తీవ్ర జ్వరం, దగ్గు, ఆయాసం, కీళ్లనొప్పులతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రధానంగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి కేసులు నమోదు కావడంతో ప్రజలు కలవరపడుతున్నారు. శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్- జీజీహెచ్)లో గత మూడు నెలల్లో డెంగ్యూ కేసులు మూడు రెట్లు పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. చాలా మందికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో నీరసించిపోతున్నారు.

- జిల్లావ్యాప్తంగా జూన్ నెలలో 7,365 జ్వరాల కేసులు నమోదయ్యాయి. జూలైలో 8,376 కేసులు, ఆగస్టులో అత్యధికంగా 8,579 జ్వరాల కేసులు నమోదయ్యాయి. శ్రీకాకుళంలోని రిమ్స్‌లో జ్వరాల కోసం ప్రత్యేక వార్డును కేటాయించారు. పిల్లల కోసం నిర్వహిస్తున్న ఐసీయూలో అధిక శాతం జ్వరాలతో బాధపడుతున్నారు. పెద్దల వార్డు కూడా జ్వరపీడితులతో నిండిపోయింది. ఆగస్టులో రిమ్స్‌లో 305 మంది రోగులు వివిధ జ్వరాలకు చికిత్సలు తీసుకున్నారు. పాతపట్నం, సీతంపేట, పాలకొండ ప్రాంతాల నుంచి ఎక్కువ సంఖ్యలో మలేరియా కేసులు రిమ్స్‌కు వస్తున్నాయి. వీటిలో తీవ్ర రక్తహీనతతో బాధపడుతూ సెరిబ్రల్ మలేరియా కేసులు రావడం గమనార్హం. అలాగే జిల్లాలో స్క్రబ్‌టైఫస్ జ్వరాలు కూడా నమోదవుతున్నాయి. ఇదిలా ఉండగా.. శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో అందే వైద్యంపై నమ్మకం లేక కొంతమంది రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఫీజు, పరీక్షలు, మందుల పేరిట వేలాది రూపాయలను ప్రైవేటు వైద్యులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

జ్వరాలు.. లక్షణాలు

- **డెంగ్యూ:** తీవ్రస్థాయిలో జ్వరం(104 డిగ్రీల వరకు), తలనొప్పి, ఒళ్లు నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుర్లు వస్తాయి. కొంతమందికి రక్త వాంతులు అవుతాయి. ప్లేట్‌లెట్స్ గణనీయంగా తగ్గిపోతాయి. విరేచనాలు, యూరిన్ ద్వారా రక్తస్రావం, దగ్గు లక్షణాలు ఉంటాయి. వీరికి తక్షణ వైద్యసహాయం అవసరం. సకాలంలో చికిత్స పొందితే పూర్తి నివారణ సాధ్యం.
- **మలేరియా:** ఈ జ్వరం కూడా దోమకాటు ద్వారా సంక్రమిస్తుంది. ఇందులో ప్లాస్మోడియం వైవాక్స్ అయితే రాత్రిపూట జ్వరం, తలనొప్పి, వాంతులు, ఒక్కోసారి దగ్గు వస్తుంది. అదే పి.పాల్సిఫారం అయితే రాత్రి వేళల్లో తీవ్రస్థాయిలో చలి జ్వరం, వాంతులు, తలనొప్పి వస్తుంది. దీనిని నిర్లక్ష్యం చేస్తే బ్రెయిన్‌కు చేరుకుని.. సెరిబ్రల్ మలేరియాగా మారి ప్రాణాంతకమవుతుంది. మూత్రపిండాలు కూడా దెబ్బతినే అవకాశం ఉంది.
- **టైఫాయిడ్:** రోజంతా జ్వరం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు.. దీని లక్షణాలు. ఈ జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే పేగులకు సంబంధించిన(టైఫాయిడ్ పెర్‌ఫొరేషన్) తీవ్రస్థాయి ఇబ్బందులు ఎదురవుతాయి. ఇది కొన్నిసార్లు ప్రాణాంతకమవుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు దోమకాటు వలన సంభవిస్తాయి. దోమతెరలు వాడడం ఉత్తమం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. జ్వరం వస్తే ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. బయటి ఆహార పదార్థాలు తినడం, అపరిశుభ్రత వలన టైఫాయిడ్ జ్వరం వస్తుంది. వేడినీటిని తాగడం, ఇంటి ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమం. వైరల్ జ్వరాలు గాలి ద్వారా వ్యాపిస్తాయి. పిల్లలను అనవసరంగా బయటకు తీసుకువెళ్లరాదు. పిల్లలకు న్యూమోనియా రాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. ఈ టీకాలు అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అన్ని రకాల జ్వరాలకు వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు వినియోగించుకోవాలి.

-డాక్టర్ ఎం.చౌదరిబాబు
ఎం.డి., పిడియాట్రిక్, జీజీహెచ్

జీజీహెచ్‌లో నమోదైన కేసులు..

నెల	డెంగ్యూ	మలేరియా	టైఫాయిడ్
జూన్	1	4	14
జూలై	4	12	34
ఆగస్టు	22	15	74



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

దిక్సూచి DIKSUCHI

కొన్ని ఆవిష్కరణలు ప్రపంచ గతినే మార్చివేస్తాయి. అలాంటి ఆవిష్కరణలుగా నిప్పు, చక్రం, ఆవిరి యంత్రాలు, కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి వాటిని పేర్కొనవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాయి. కానీ మరో అయిదారేళ్లలో అందుబాటులోకి రాబోతున్న 6జీ టెక్నాలజీ పనిలో మానవ ప్రమేయాన్ని ఆసాంతం తగ్గించనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీ మానవ-రోబో సమన్వయంతో పనులు చక్కబెట్టడానికి వీలుకల్పిస్తుండగా, రాబోతున్న 6జీ టెక్నాలజీ కృత్రిమ మేధకు మరింత వేగాన్ని అందించి అనేక రంగాల్లో మానవ ప్రమేయాన్ని దాదాపు శూన్యం చేయనుంది. ఉదాహరణకు స్వయంచోదక వాహనాలు(డ్రైవర్‌లెస్ కార్లు)ను చెప్పుకోవచ్చు.

● ఈ అధునాతన 6జీ సాంకేతికతను అందిపుచ్చుకుని అందరికన్నా ముందుగా ప్రపంచ విపణిలో మార్కెట్ అవకాశాలను కొల్లగొట్టడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా రంగంలోకి దిగింది. 2030 నాటికల్లా 6జీ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి గల సాధ్యాసాధ్యాల పరిశీలన, సూచనల నిమిత్తం ఎ.కె.తివారీ అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.

● తదనంతరం '6 మూలస్తంభాల వ్యూహంతో 6జీ విజన్'ను తదుపరి '6జీ మిషన్'ను భారత టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రవేశపెట్టడమే కాక అంతర్జాతీయ పరస్పర సహకారం నిమిత్తం భారత్ 6జీ అలయెన్స్(బీ6జీఏ)ను కూడా ఏర్పాటు చేసింది. ఈవిధమైన కార్యాచరణల నేపథ్యంలో అసలు 6జీ టెక్నాలజీ అంటే ఏమిటి? ప్రస్తుత తరం 5జీ టెక్నాలజీతో పోల్చిన ఏవిధంగా మెరుగైనది? 6జీ సాంకేతికత కోసం జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలేమిటి? అన్న కోణంలో పరిశీలన జరపాల్సి ఉంది.

6జీ అంటే?

● వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీని దాని పరిణామ క్రమం ఆధారంగా వివిధ జనరేషన్లుగా విభజించి పేర్కొంటారు. ఈవిధంగా ఇప్పటివరకూ 1 నుంచి 5 తరాలు అందుబాటులోకి రాగా, మరింత అభివృద్ధి చెందిన తరంగా రాబోతున్న తదుపరి తరాన్ని 6వ తరం గా పేర్కొంటున్నారు.

5జీతో పోల్చితే 6జీ ఏవిధంగా మెరుగైనది?

● వేగపరంగా 5జీ ఒక మిల్లీ సెకన్(1000 మైక్రో సెకన్లు)లో 20 గిగాబైట్ల డేటాను అందిస్తుంది. అదే 6జీ 1 మైక్రో సెకన్‌లో వెయ్యి గిగాబైట్ల(ఒక టెరాబైట్) డేటాను అందిస్తుంది. అంటే 6జీ సాంకేతికత వేగంలో 5జీ కన్నా వెయ్యిరెట్లు మెరుగైనది.

● అదేవిధంగా లేటెన్సీ అనగా నెట్‌వర్క్‌లోని ఒక పాయింట్ నుంచి మరో పాయింట్‌కు సమాచారం(డేటా) చేరడానికి పట్టే సమయం(జాప్యం)ను, 5జీతో పోల్చిన 6జీ విపరీతంగా తగ్గిస్తుంది. 5జీలో ఈ లేటెన్సీ 5 మిల్లీ సెకన్లు కాగా, 6జీతో 'అల్ట్రాలో లేటెన్సీ(అతి తక్కువ జాప్యం)' సాధ్యపడి ఒక మైక్రో సెకనుకు ఈ జాప్యం పరిమితం అవుతుందని అంచనా. ఇంతవరకూ ఉపయోగించని 'టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలను 6జీ సాంకేతికతలో వినియోగించనుండటంతో అల్ట్రాలో లేటెన్సీ సాధ్యం కానుంది. టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలు విద్యుదయస్కాంత వర్ణ పటంలో పరారుణ తరంగాలు, మైక్రోవేవ్ తరంగాల మధ్య ఉంటాయి. చాలా సూక్ష్మంగానూ, సున్నితంగానూ ఉండే ఈ తరంగాలు భారీస్థాయిలో డేటాను వేగంగా చేరవేయగలవు.

● 5జీ సాంకేతికత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'ను ప్రవేశపెట్టడానికి సహకరించి, మానవుల నుంచి యంత్రానికి కమ్యూనికేషన్‌ను సాధ్యం చేసింది. ఈ పునాదిపై మరింత విస్తృతీకరించిన 6జీ సాంకేతికత మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్‌ను(యంత్రాల మధ్య సమాచార బదిలీ) సాధ్యపరిచింది. ఇది చాలా వేగంగా జరిగే కమ్యూనికేషన్ కావడంతో మానవ మెదళ్లు గ్రహించగలవు.

6జీ టెక్నాలజీ ద్వారా రానున్న మార్పులు

1. కమ్యూనికేషన్ల పరంగా: నెట్‌వర్క్ స్లైకింగ్ ప్రక్రియ ద్వారా విస్తృత నెట్‌వర్క్‌లను అతి చిన్న ప్రత్యేక నెట్‌వర్క్‌లుగా విభజించడం వల్ల వివిధ రకాల సమాచార రద్దీని ప్రాధాన్యతల ఆధారంగా విభజించి నిర్వహించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా సమాచార ప్రసారంలో విస్తృతస్థాయిలో భద్రత లభిస్తుంది. ఎన్‌క్రిప్షన్, హోలో గ్రాఫిక్ కమ్యూనికేషన్, మెరుగైన కృత్రిమమేధ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీల ద్వారా మరింత భద్రతతో పాటు స్పష్టత, నిజ సమయ సమాచార బదిలీ(రియల్ టైమ్ డేటా ట్రాన్స్‌ఫర్) సాధ్యమవుతాయి. మరింత వేగంగా ఫైల్ డౌన్ లోడింగ్, వెబ్‌సెర్ఫ్, వర్చువల్ రియాలిటీ, సమాచార మార్పిడి సాధ్యమవుతాయి.

2. రవాణారంగం: వేగం, లేటెన్సీల పరంగా, మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, త్రీడీ సాంకేతికతలతో ఈ 6జీ టెక్నాలజీ తీసుకువచ్చే మార్పుల కారణంగా స్వయం చోదిత వాహనాలు(డ్రైవర్ లెస్ కార్లు), ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ; బుల్లెట్ ట్రైన్స్ వంటి రవాణారంగ అంశాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

3. స్మార్ట్ సిటీస్, గ్లోబల్ కనెక్టివిటీ: రియల్ టైమ్ మానిటరింగ్, గ్లోబల్ కనెక్టివిటీ(ప్రజలు, పరికరాలు, సిస్టమ్స్, వివిధ సంస్థల మధ్య నిరంతర అనుసంధానత) వల్ల ట్రాఫిక్ నుంచి, ఫ్రిజ్‌లో సరుకుల వరకూ అన్నిటి సమాచారం అప్రయత్నంగా బదిలీ అయిపోతున్నాయి. అనుసంధానతలు పెరగడం వల్ల పట్టణ-గ్రామ అంతరాలు తొలగిపోతాయి.

4. విద్య, పరిశోధన రంగాలు: విద్యార్థులకు విద్యారంగంలో ప్రపంచవ్యాప్త అనుసంధానత ఏర్పడుతుంది. వర్చువల్ క్లాసెస్, టీచర్స్, క్లాస్‌మేట్స్‌తోపాటు సమాచార విశ్లేషణ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్(అనుభవ పూర్వక అధ్యయనం) సాధ్యమవుతాయి. అదేవిధంగా అన్ని రంగాల్లో సంక్లిష్ట అంశాలపరంగా కూడా పరిశోధనకు అవకాశం ఏర్పడుతుంది. పరిశోధనల్లో వేగం సాధ్యమవుతుంది.

5. ఆరోగ్యరంగం: టెలీ మెడిసిన్, కృత్రిమమేధ మద్దతుతో క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా రోబోటిక్ పద్ధతిలో నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వేగం, వైద్యులతో అనుసంధానత మొదలైన సౌలభ్యాలు కలుగనున్నాయి.

6. వ్యవసాయ, వ్యాపార, ఆర్థిక రంగాలు: వ్యవసాయ, వ్యాపార రం గాల్లో డిమాండ్ - సప్లయ్ - ఉత్పత్తి నియంత్రణపరంగా తక్షణ సమాచార బదిలీ విస్తృతస్థాయిలో వివిధ వ్యవస్థల మధ్య జరిగి మార్కెట్లు విస్తరిస్తాయి. నష్టభయం తగ్గుతుంది. వేగవంతమైన కృత్రిమమేధతో నిర్ణయాలు, విశ్లేషణ, ఆచరణపరమైన జాప్యాన్ని నివారించవచ్చు. ఇవి సమిష్టిగా ఆర్థికవ్యవస్థ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

7. అంతరిక్ష రంగం, రక్షణ రంగం, విపత్తు నిర్వహణ: అంతరిక్ష ప్రయోగాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోల్ ద్వారా వాహక నౌకలు, రోబోలు వంటి వాటిని తక్షణం నియంత్రిస్తూ వైఫల్యాలను తగ్గించవచ్చు. అత్యధిక రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలు ఖగోళ పరిస్థితుల, పదార్థాల విస్పష్ట అంచనాకు సహకరిస్తాయి. అదేవిధంగా సుదూర ఖగోళ అన్వేషణ సాధ్యమై దూరాన ఉన్న నక్షత్రాలు, గ్రహాల సమాచారం లభ్యమవుతుంది. మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్, వేగం వల్ల వివిధ రకాల భౌగోళిక పరిస్థితుల్లో, సరిహద్దుల్లో, యుద్ధ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ప్రయోజనకరం.

8. పర్యావరణం: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వల్ల ప్రయాణ అవసరాలు తగ్గి కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గుతుంది. అదేవిధంగా స్మార్ట్ సిటీస్, స్మార్ట్ మీటర్స్ వంటి వాటివల్ల విద్యుత్, నీరు వృథా తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో..)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

నవ్య | చిత్రజ్యోతి

జాగ్రత్త సుమా!



సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే తారల్లో రష్మిక మందన్న ఒకరు. అయితే ఆమె పోస్టులు పెట్టి నెల రోజులయింది. ఈ స్వల్ప విరామానికి గల కారణాన్ని ఆమె తాజాగా అభిమానులతో పంచుకున్నారు. "నెల క్రితం నాకు ఓ ప్రమాదం జరిగింది. ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదు. గాయం చిన్నదే. వైద్యుల సలహా మేరకు ఇంటిపట్టునే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాను. త్వరలోనే సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతాను. జీవితం చాలా విలువైంది. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండండి. రేపనేది ఉంటుందో లేదో తెలీదు. జాగ్రత్త సుమా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. రష్మిక ప్రస్తుతం 'పుష్ప 2', 'కుబేర', 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రాల్లో నటిస్తున్నారు.

అడ్వాన్స్ బుకింగ్స్‌లో దుమ్మురేపుతున్న దేవర



జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారాస్థాయిలో పెంచాయి. 'దేవర పార్ట్ 1' ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సినిమా రిలీజ్ కాకముందే బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. నార్త్ అమెరికాలో ఈ చిత్రం ప్రీమియర్ షో టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయిపోయాయి. ఇప్పటికే 8 లక్షల డాలర్లను (25 వేల టిక్కెట్లు) అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో వసూలు చేసి దుమ్మురేపుతోంది. 'దేవర' చిత్రం ట్రైలర్ ఈ రోజు విడుదల కానుంది.

విడిపోయిన జయం రవి దంపతులు



కోలీవుడ్ హీరో జయం రవి, ఆరతి జంట విడిపోయింది. తన భార్య ఆరతికి విడాకులు ఇస్తున్నట్లు జయం రవి ప్రకటించారు. 2009లో జయం రవి ఇరువైపు కుటుంబీకుల అంగీకారంతో ఆరతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరి వైవాహిక జీవితం 15 ఏళ్లపాటు సాఫీగా కొనసాగింది. కొద్ది నెలలకు ముందు ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో విడిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం జయం రవి తన విడాకుల విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. సినిమాల్లోనూ, నిజజీవితంలోనూ తాను ఎల్లప్పుడు పారదర్శకంగానే ఉంటానని, ఎలాంటి దాపరికాలకు తావులేదని భారమైన హృదయంతో ఓ చేదు విషయాన్ని చెప్పదలిచానని పేర్కొంటూ ఆరతితో వైవాహిక జీవితానికి స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తొందరపడి ఈ నిర్ణయం తీసుకోలేదని, ఆచితూచి, తనవారి సంక్షేమం దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని జయం రవి తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

మెరుపై వచ్చిండే..



'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో'ను మేకర్స్ విడుదల చేశారు. 'మెరుపై వచ్చిండే.. మడత పెట్టి వచ్చిండే.. మనసు పెట్టి వచ్చిండే' అంటూ సాగే ఈ హుషారైన మాస్ గీతంలో రజనీ సరసన మంజూ వారియర్ ఆడిపాడారు. అనిరుధ్ సంగీతం అందించిన ఈ పాటకు శ్రీనివాస మౌళి లిరిక్స్ అందించారు. నకాశ్ ఆజీజ్, అరుణ్ కౌండిన్య, దీప్తి సురేశ్ ఆలపించారు.

అన్ని ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రం



'క్రేజీ బాయ్' ఫేమ్ దిలీప్‌ప్రకాశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉత్సవం'. ప్రకాశ్‌రాజ్, రాజేంద్రప్రసాద్, నాజర్, రెజీన కసాండ్ర కీలక పాత్రలు పోషించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ నిర్మించారు. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దిలీప్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ఎంతో ఉన్నతమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం. ఇందులో కథనే హీరో. రంగస్థల కళాకారుల జీవితాలతో ముడిపడిన చిత్రమిది. ఎంతో అనుభవమున్న నటులు ఇందులో నటించారు. మంచి సందేశం, ప్రేమ కథ, వినోదంతో పాటు ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రమిది. అనూప్ రూబెన్స్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాకు బ్రహ్మ కడలి అందించిన ఆర్ట్ వర్క్ ప్రత్యేకాకర్షణ. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. నా నెక్ట్స్ సినిమా అదే తరహాలో ఉండబోతోంది'.

నా ఇంటి పేరు అది కాదు



నటిగా సెలక్టివ్ పాత్రలు ఎంచుకుని తన నటనతో అందరినీ ఫిదా చేస్తుంటారు నిత్యామేనన్. ఇటీవలే మీడియాతో ముచ్చటించిన ఆమె.. అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసే ఓ విషయాన్ని పంచుకున్నారు. "చాలా మంది నా ఇంటి పేరు మేనన్. నా స్వస్థలం కేరళ అనుకుంటారు. నిజానికి నా ఇంటి పేరు మేనన్ కాదు. నా పేరు ఎన్.ఎస్.నిత్య. ఎన్ అంటే మా అమ్మ నళిని. ఎస్ అంటే మా నాన్న సుకుమార్. మాది బెంగుళూరు. మా కుటుంబం మూడు తరాలుగా బెంగుళూరులోనే ఉంటోంది. మేమంతా ఇంటి పేరును గోప్యంగా ఉంచడానికి ఇష్టపడతాం. మా కులమిదని చెప్పుకోవడం కూడా మాకు ఇష్టం ఉండదు. కేవలం న్యూమరాలజీ ఆధారంగా నా పేరు తర్వాత 'మేనన్' జతచేసుకున్నాను" అని చెప్పారు.

డబుల్ థ్రిల్‌తో...



శ్రీసింహ కోడూరి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019లో విడుదలై సూపర్ సక్సెస్ సాధించిన 'మత్తు వదలరా' సినిమాకు రెండో భాగం. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా శ్రీసింహ మీడియాతో మాట్లాడారు.

"మొదటి భాగంతో పోల్చితే ఇందులో చాలా మార్పులు జరిగాయి. రెండో భాగం ఒక డిఫరెంట్ థ్రిల్లర్‌గా ఎన్నో ట్విస్టులు, సర్‌ప్రైజ్‌లతో అలరిస్తుంది. ఇందులో నేను, సత్య పోషించిన పాత్రలు డెలివరీ బాయ్స్ నుంచి స్పెషల్ ఏజెంట్స్‌గా మారే క్రమం ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. ఫరియా అబ్దుల్లా తనకు సరిపోయే పాత్రను ఇందులో పోషించారు. ఆమె ఓ పాట పాడటమే కాకుండా కొరియోగ్రఫీ కూడా అందించారు. ఈ సినిమా మొదటి భాగం కంటే డబుల్ థ్రిల్‌ను పంచుతుంది. ఈ మూవీ ఫ్రాంచైజీని కొనసాగించే ఆలోచనల్లో ఉన్నాం" అని చెప్పారు.

యూత్, ఫ్యామిలీ ఆడియన్సే టార్గెట్



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ విడుదల చేశారు. విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వరద బాధితుల సహాయార్థం తన వంతు ఆర్థిక సహాయాన్ని చంద్రహాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రహాస్ మాట్లాడుతూ 'ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయాలని హీరోగా మారాను. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నాను. వాటిల్లో ఫస్ట్ మూవీ 'రామ్‌నగర్ బన్నీ'. అక్టోబరులో విడుదలవుతుంది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

నాటి మద్రాసు నేపథ్యంలో కాంత




రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కలసి నిర్మించే 'కాంత' చిత్రం షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ జంటగా నటించే ఈ సినిమాకు సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. సముద్రఖని కీలక పాత్రధారి. రామానాయుడు స్టూడియోలో తొలి క్లాప్ ఇచ్చి 'కాంత' చిత్రానికి శ్రీకారం చుట్టారు విక్టరీ వెంకటేశ్. 1950 నాటి మద్రాసు బ్యాక్‌డ్రాప్‌లో మానవ భాగోద్వేగాల లోతుల్ని ఆవిష్కరించే ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంటుందని దర్శకుడు చెప్పారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ 60వ సంవత్సరం సందర్భంగా స్పిరిట్ మీడియా కొత్త శకానికి నాంది పలుకుతూ తీస్తున్న సినిమా ఇదనీ రానా చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంత్ పొట్లూరి, రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు

దసరాకి వస్తున్నాం



సుహాస్, సంగీర్తన జంటగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన 'జనక అయితే గనక' చిత్రం కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు. దసరా సందర్భంగా అక్టోబరు 12న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సందీప్‌రెడ్డి దర్శకుడు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ వీడియో విడుదల చేశారు. ఈ సినిమా ఓవర్‌సీస్ హక్కులు సొంతం చేసుకున్న సుహాస్‌కి అందరూ ఫోన్ చేసి రిలీజ్ ఎప్పుడు అని అడుగుతుంటారు. ఈ గోల భరించలేక సుహాస్ దిల్ రాజుకు ఫోన్ చేసి రిలీజ్ డేట్ గురించి అడగడం, 'మనది ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా కనుక దసరా సందర్భంగా అక్టోబర్ 12న విడుదల చేస్తున్నాం' అని చెప్పడం .. ఇలా ఆసక్తికరంగా ఆ వీడియో రూపొందించారు.

మధ్యతరగతి మందహాసం




సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. దసరాకి ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. మధ్యతరగతి యువకుడి పాత్ర పోషిస్తున్న సుధీర్‌బాబు స్కూటర్ నడుపుతూ చిరునవ్వుతో స్కూల్ పిల్లలను పలకరిస్తూ కనిపించారు. ప్రేమ, అనుబంధాలకు అర్థం చెప్పే సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. ఈ నెల 12న టీజర్ విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఆర్ణ ఈ సినిమాలో కథానాయిక.

జాతకం పూర్తి



ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా రూపొందుతున్న 'సారంగపాణి జాతకం' షూటింగ్ పార్ట్ పూర్తయింది. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'నాకు ఎప్పటినుంచో పూర్తి వినోదాత్మక సినిమా తీయాలనే కోరిక ఉంది. జంధ్యాలగారితో ఓ కామెడీ ఫిల్మ్ తీయాలనుకున్నాను కానీ కుదరలేదు. ఆ కోరిక ఇప్పుడు 'సారంగపాణి జాతకం' సినిమాతో తీరుతోంది. మనిషి భవిష్యత్ అతని చేతి రేఖల్లో ఉంటుందా, లేక అతని చేసే చేతల్లో ఉంటుందా అని ప్రశ్నకు జవాబు ఇచ్చే పూర్తి హాస్య రస చిత్రం ఇది. మా సంస్థలో రెండు విజయవంతమైన సినిమాలు చేసిన మోహనకృష్ణ వినోదభరితంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఖర్చు పరంగా, టెక్నికల్ పరంగానూ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా చేస్తున్నాం' అని చెప్పారు

సినిమాగా యండమూరి అంతర్ముఖం



ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ రాసిన నవలల్లో అగ్ర తాంబూలం అందుకొన్న 'అంతర్ముఖం' నవల ఇప్పుడు సినిమాగా రూపొందనుంది. భీమవరం టాకీసు పతాకంపై 117వ చిత్రంగా ఇది రూపొందుతుందని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. యండమూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. సీనియర్ ఛాయాగ్రాహకుడు మీర్ ఈ సినిమాకు పని చేస్తున్నారు. అలాగే అల్లాణి శ్రీధర్, నరసింహ నంది దర్శకత్వంలో రెండు సినిమాలు కూడా తీసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రామసత్యనారాయణ చెప్పారు.

మలయాళ హక్కులు కొన్నారు



కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రం మలయాళ థియేట్రికల్ రైట్స్ హీరో దుల్కర్ సల్మాన్‌కు చెందిన వేఫరర్ ఫిల్మ్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ చూసి దుల్కర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'క' తెలుగు హక్కుల్ని నిర్మాత వంశీ నందిపాటి ఇప్పటికే పొందారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.


ఎల్.ఎన్.పేట: అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు


పొందూరు: లైదాం వంతెన వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు



పాతపట్నం: కాజ్ వే వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

తెరిపిచ్చినా..

- ముంపులోనే పొలాలు
- పంటలు నష్టపోతున్నామని రైతుల ఆవేదన
- రోడ్లపైనా ప్రవహిస్తున్న వర్షపు నీరు

బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గడచిన ఐదురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సోమవారం కొంత తెరిపి ఇచ్చింది. రోజంతా వర్షం కురవకపోయినా నదులు, వాగులు, గెడ్డల్లో నీటి ప్రవాహాలు ఉధృతంగా ఉండడంతో రోడ్లు, పొలాల్లోకి నీరు చేరి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంటలు నష్టపోతున్నామని వాపోయారు. అలాగే పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. పలు చోట్ల కాలువలకు గండ్లు పడడంతో ఇబ్బందులు తలెత్తాయి. రోజుల తరబడి భారీ వర్షం కురవడం సోమవారం తెరిపి ఇచ్చి ఎండ కాయడంతో తడిచిన సరుకులను ఎండబెట్టుకున్నారు. వర్షాలతో దెబ్బ తిన్న పంట పొలాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు తగు సూచనలిచ్చారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పరిస్థితి ఇలా..

-ఆంధ్రజ్యోతి బృందం


కవిటి: గొర్లెపాడులోని రైల్వే వంతెన కింద ప్రవహిస్తున్న వరద నీరు


పొందూరు: బొడ్డేపల్లి రైల్వే అండర్ పాసేజ్ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు


మెళియాపుట్టి: గంగరాజపురంలో కూలిన ఇంటి గోడ


గార: సుంకరపాలెం-కూర్మనాథపురం మధ్య వంతెనపై నీటి ప్రవాహం


కంచిలి: అర్జునాపురం వద్ద రోడ్డుపై చేరిన నీరు


పలాస రూరల్: రెంటికోట ప్రధాన వీధిలో రోడ్డు ఇలా..


నందిగాం: తడిచి ముద్దయిన ఎంపీడీవో కార్యాలయం


ఎచ్చెర్ల: బొంతలకోడూరు- రుప్పపేట మధ్య పెద్దగెడ్డ ప్రవాహానికి మునిగిన అప్రోచ్ రోడ్డు


హరిపురం: కోతకు గురైన కొండలోగాం చింతచెట్టు కాలనీ రోడ్డు


పోలాకి: సుసరాం వద్ద తంపర పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


ఆమదాలవలస: పంట పొలాలను పరిశీలిస్తున్న అధికారులు


నరసన్నపేట: గెడ్డవానిపేట వద్ద వంశధార ఉధృతిని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అనూరాధ


బూర్జ: నీట మునిగిన వరి పొలాలు

ఎక్స్‌కవేటర్ స్వాధీనం


తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉంచిన ఎక్స్‌కవేటర్

మెళియాపుట్టి: కంకరను అక్రమంగా తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న విషయమై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'సెలవులు వస్తే వారికి పండగే' శీర్షికతో వచ్చిన కథనానికి ఎమ్మెల్యే మామిడి గోవింద రావు స్పందించారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫోన్‌లో సూచించారు. ఈ నేపథ్యంలో తవ్వకాలు చేపడుతున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉండగా కేసు నమోదు చేయాలని ఆదేశించడంతో కంకర తవ్వకాలు చేస్తున్న కొందరు.. నేతలతో మంతనాలు చేయిస్తున్నట్లు సమాచారం. అయితే రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

గణేష్ లడ్డూ రూ.37 వేలు

టెక్కలి: రావివలస కొత్త కాలనీ వద్ద ఆదివారం రాత్రి వినాయకుని లడ్డూ వేలంపాట నిర్వహించారు. స్థానికుడు కె.సచిన్ రూ.37 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. ఈ మొత్తాన్ని వినాయక నిమజ్జనోత్సవానికి వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ● సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో వినాయక చవితి సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించగా దమ్మలవీధికి చెందిన లడ్డూ రూ.7 వేలకు, వెలమవీధిలో రూ.5500 పలికాయి. ఈ కార్యక్రమాల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి రాయితీ అందించాలి

టెక్కలి: ఎన్నికలకు ముందు ఇప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుడు బగాది వాసుదేవరావు కోరారు. ఈ మేరకు సోమవారం రావివలస సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. జీడిపంటకు మద్దతు ధర ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నంబూరు షణ్ముఖరావు, సాంబమూర్తి, సర్లాన సుధాకర్, ఇప్పిలి మల్లేసు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

శిథిల భవనాలను గుర్తించి నివేదిక

మెళియాపుట్టి: శిథిలావస్థలో ఉన్న పాఠశాలల భవనాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందించడం జరుగుతుందని ఎంఈవో పద్మనాభం తెలిపారు. సోమవారం పదనాపురం, డబ్బగూడ మండల పరిషత్ పాఠశాలను పరిశీలించారు. చింతపల్లి, నవరకొలిగాం, చందనగిరి, కేరాశింగి, అనంతగిరి, దాసుపురం పాఠశాలల శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. వర్షాలు పడుతున్నందున పాత భవనాలు కూలిపోయే పరిస్థితి ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలతో నివేదికను డీఈవోకు అందిస్తామన్నారు. ఆయనతో పాటు సీఆర్పీ ప్రభాకరరావు ఉన్నారు.

నేడు జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్

హరిపురం: మందస మండలం రాంపురం పంచాయతీ టి.గంగువాడ గ్రామంలో ఉద్దానం ఉపాధ్యాయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి గ్రూపు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. వినాయక భక్తి కమిటీ నిర్వహణలో జరిగే ఈ పోటీల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అర్హులన్నారు. విజేతలకు నగదు పురస్కారంతో పాటు జ్ఞాపికలను అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు పాల్గొనాలని కోరారు.

కరకవలసలో ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు

జలుమూరు: కరకవలస గ్రామంలో ప్రభుత్వ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేస్తున్న షెడ్ల పనులను సోమవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు వీఆర్వో విజయబాబు ఆక్రమణదారులతో మాట్లాడి పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు

సంతబొమ్మాళి: వినాయక చవితి 21 వార్షికోత్సవం సందర్భంగా సంతబొమ్మాళిలో సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 9 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులను అందజేశారు. మాజీ సర్పంచ్ కూశెట్టి కాంతారావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

60 మంది నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

నందిగాం: కవిటిఅగ్రహారంలో నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకుడు బంగారి శివకృష్ణ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని 60 మంది పేదలకు సరుకులు అందించారు.

శ్రమదానం చేసి..

నరసన్నపేట: మాకివలస గ్రామంలో రైతులంతా ఒక్కటైయ్యారు.. పొలాల్లోకి చేరుతున్న వరద నీటిని బయటకు పంపే చర్యలు తీసుకున్నారు. సాగునీటి కాలువల్లో పిచ్చి మొక్కలు, పూడికలు పేరుకుపోవడంతో సోమవారం వారంతా శ్రమదానం చేసి నీటిని పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన వరదనీరు పిల్ల కాలువల ద్వారా బయటకు వెళ్లేలా మాజీ సర్పంచ్ యాళ్ల వేణు గోపాలరావు ఆధ్వర్యంలో రైతులు చర్యలు చేపట్టారు.


కాలువలో పూడికను తొలగిస్తున్న రైతులు

గ్రామస్థులే ముందుకొచ్చి..

హిరమండలం: గడచిన రెండు రోజులుగా కురిసిన వర్షాలకు జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల ఆవరణలో నీరు చేరింది. దీంతో దారి లేక విద్యార్థులు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో గ్రామస్థులు స్పందించారు. శ్రమదానం చేసి పాఠశాల మైదానాన్ని చదును చేశారు.


మైదానాన్ని చదును చేస్తున్న దృశ్యం

ప్రజలను అప్రమత్తం చేయాలి: జేసీ

మెళియాపుట్టి/పాతపట్నం: మహేంద్రతనయ నదీ పరీవాహక ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం ఆయన రట్టిణి, మెళియాపుట్టి, పాతపట్నం వద్ద మహేంద్రతనయ నీటి ప్రవాహ ఉధృతిని పరిశీలించారు. ఒడిశాలో అధికంగా వర్షాలు పడుతున్నందున మహేంద్ర తనయ నదిలోకి నీరు చేరుతోందని, దీనివల్ల ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగించాలన్నారు. విధుల్లో అశ్రద్ధ వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వంశధార ఈఈ శేఖర్, టెక్కలి ఆర్డీవో సుదర్శన దొర, మండల ప్రత్యేకాధికారి రవికృష్ణ, తహసీల్దార్లు హనుమంతరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎంపీడీవోలు చంద్రకుమారి, జయంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పాతపట్నం కాజ్ వే వద్ద సీఐ ఎస్.సాయి, ఎస్ఐ బి.లావణ్య పర్యవేక్షణలో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేసి ప్రజలను అప్రమత్తం చేశారు.


మెళియాపుట్టి: రట్టిణి గ్రామం వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

గొట్టాబ్యారేజీ పరిశీలన

హిరమండలం: వంశధార నదికి వరద వస్తే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సూచించారు. సోమవారం టెక్కలి ఆర్డీవో సుదర్శనదొరతో కలిసి గొట్టాబ్యారేజీని పరిశీలించారు. వరద పరిస్థితిపై వంశ ధార అధికారులతో చర్చించారు. క్యాచ్‌మెంట్ ఏరియాలో పెద్దగా వర్షాలు లేకపోవడంతో వంశధారకు వరద వచ్చే పరిస్థితి లేదని ఏఈఈ సత్యనారాయణ తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వంశధార నదికి వరద ముప్పు తప్పిన ట్లేనని, మంగళవారం ఉదయం 25వేల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేలకు నష్ట పరిహారం

జలుమూరు: ఇటీవల కురిసిన వర్షాలకు నీటమునిగి నష్టపోయిన వరి చేలకు పరిహారం అందించేందుకు నివేదికలు తయారు చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఏవో కె.సురేష్‌కు ఆదేశించారు. పాగోడు, తాళ్లవలస పరిసర ప్రాంతాల్లో నీట మునిగిన వరిచేలను సోమవారం పరిశీలించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే ఖరీఫ్‌కు ఇటువంటి నష్టం జరగకుండా ఉండేందుకు కాలువ గెడ్డ పూడికలు తీయిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు ప్రకాష్, దుబ్బ రామారావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, జుత్తు అప్పలనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు. అలాగే నీట మునిగిన పంట పొలాలను టెక్కలి ఆర్డీవో సుదర్శన్‌దొర కూడా పరిశీలించారు. ఈ పరిశీలనలో మండల ప్రత్యేకాధికారి పడాల వాసుదేవరావు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పాగోడు వద్ద నీట మునిగిన వరి చేలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

అనుమతుల్లో జాప్యం లేకుండా చూడండి

టెక్కలి: గ్రానైట్ అనుమతుల జారీలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రానైట్ క్వారీల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం గనులు, భూగర్భశాఖ ఏడీ ఫణి భూషణరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. పర్మిట్లను త్వరితగతిన జారీ చేయాలని రాష్ట్రప్రభుత్వం మెమో జారీ చేసినా ఎందుకు ఆలస్యం జరుగుతోందని వారు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విశ్వసముద్ర సంస్థ అనుమతులు జారీ చేసేదని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియ చేపడుతున్నందున అనుమతుల జారీలో కొంత జాప్యం జరిగిందని ఏడీ వారికి తెలిపారు. త్వరితగతిన సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఏడీని కలిసిన వారిలో గ్రానైట్ క్వారీల ప్రతినిధులు వెంకటాచలపతి, హరి, ఎస్.శ్రీనివాస్, అల్లు నగేష్, కింగ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.


ఏడీకి వినతిపత్రం ఇస్తున్న క్వారీ ప్రతినిధులు

వంశధారకు 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హిరమండలం: వంశధార నదికి వరద ముప్పు తప్పినట్లేనని వంశధార అధికారులు తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గొట్టాబ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోందన్నారు. సోమవారం రాత్రి 8 గంటలకు 11,553 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా బ్యారేజీ 17 గేట్లు పైకెత్తి 10,193 క్యూసెక్కులను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. మంగళవారం ఉదయానికి 25వేల క్యూ సెక్కుల వరకు నీటి ప్రవాహం వచ్చే అవకాశం ఉందని జేఈఈ పరిశుద్ధబాబు చెప్పారు.

ప్రత్యేక వైద్య శిబిరం

టెక్కలి: చాకిపల్లిలో కె.కొత్తూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేకవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గాయత్రి, ఇంద్రజ, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రోగులను పరీక్షించి మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ప్రత్యేకాధికారి శైలజ, ఎంపీడీవో లక్ష్మీబాయి పరిశీలించారు. అనంతరం తాగునీరు, పారిశుధ్యం, క్లోరినేషన్ అంశాలపై ఎంపీడీవో సిబ్బందికి సూచనలిచ్చారు. మాజీ సర్పంచ్ పంగ తవిటయ్య పాల్గొన్నారు. ● నరసన్నపేట: వర్షాలకు తాగునీరు కలుషితమయ్యేప్రమాదం ఉన్నందున వైద్య సిబ్బంది గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. సోమవారం అంబాజీపేటలో ఉర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఇంటింటికీ వెళ్లి కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

మావో పోరాటం చిరస్మరణీయం

పలాసరూరల్: విప్లవంలో వేగుచుక్క మావోజెడాంగ్ అని, ఆయన పోరాటం చిరస్మరణీయమని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. తర్లాకోట పంచాయతీ కొఠారింగి గ్రామంలో మావో 48వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విప్లవ పోరాటంలో మావో విధానాలు ప్రపంచ దేశాలకు దిక్సూచిగా నిలిచాయన్నారు. వ్యవసాయ విధానంతో చైనాను ముందు వరుసలో నిలిపిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం చేయడం ద్వారానే మావోకు నిజమైన నివాళి అన్నారు. అనంతరం మావో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, సవర సోమేశ్వరరావు, సవర బంగ్లాకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మావో చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

పారిశుధ్య పనులు వేగవంతం చేయండి

కోటబొమ్మాళి: తిలారు గ్రామంలో పారిశ్యు పనులు వేగవంతంచేయాలని మండల ప్రత్యేకాధికారి ఆర్.గడ్డెమ్మ సూచించారు. సోమవారం గ్రామంలో పర్యటించారు. వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందువల్ల పరిసరాల పరిశుభ్రత, గ్రామ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు బ్లీచింగ్ జల్లాలని, బావుల్లో క్లోరినేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, ఈవోపీఆర్డీ బి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు క్లోరినేషన్ చేయించాలి

మెళియాపుట్టి: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయించాలని డీఎల్డీవో అలివేలు మంగమ్మ అన్నారు. సోమవారం మెళియాపుట్టి సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో చైతన్యం చేయాల న్నారు. కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దోమలు ఉత్పత్తి కాకుండా నీరు నిలువ లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రకుమారి, కార్యదర్శి చింతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట: వంశధార నదీతీర ప్రాంత గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి అనూరాధ అన్నారు. సోమవారం మడపాం, బుచ్చిపేట, చేనులవలస, అంబాజీపేట, లుకలాం, కామేశ్వరిపేట, కొబగాం, గెడ్డవానిపేట గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. తహసీల్దార్ సత్యనారాయణ సుందరాపురం, చిక్కాలవలస, పారశెల్లి గ్రామాల్లో తంపర భూములను పరిశీలించారు. ఎంపీడీవో మధుసూదనరావు కంబకాయి. కరగాం, రావులవలస, కోమర్తి తదితర గ్రామాల్లో ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

శానిటేషన్ పనులపై దృష్టి సారించండి

పాతపట్నం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి అజయ్‌కార్తీక్ అన్నారు. పాతపట్నంలో సోమవారం పరిశీలించారు. జూబిలీ రోడ్‌లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దుతాం

- 25.5 కిలోల గంజాయి స్వాధీనం.. ఆరుగురి అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఇచ్ఛాపురం: జిల్లాలో గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టి, గంజాయి రహిత జిల్లాగా తీర్చుదిద్దుతామని ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఒడిశా నుంచి పురుషోత్తపురం చెక్‌పోస్టు మీదుగా ఆంధ్రాలోకి గంజాయి మూటలు తరలిస్తున్న ఆరుగురుని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.లక్ష విలువ చేసే 25.560 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా సోమవారం పట్టణ పోలీసులు పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద నిఘా పెట్టి తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా పాత్రపూర్ బ్లాక్ తినపొరియా గ్రామానికి చెందిన రవీంద్రసేతి, సింహాచల సేతి ఒడిశాలో గంజాయిని కొనుగోలు చేసి తెచ్చి పురుషోత్తపురం చెక్‌పోస్టు వద్ద ఒక పాన్‌షాప్ నిర్వహిస్తున్న చిన్నవీధికి చెందిన బుగ్గ చిరంజీవి, తెలుకుల కృష్ణసాహు, బుగ్గ సావిత్రి ద్వారా తమిళనాడు రాష్ట్రం తిరునవెల్లి జిల్లా అలుంగలం తాలూకా నెట్టూరు గ్రామానికి చెందిన ఎం.రమేష్‌కు అమ్ముతుండగా ఆ ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి ఏడు సెల్‌ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి నియంత్రణలో భాగంగా జిల్లాలో పురుషోత్తపురం, పైడిభీమవరం, పాతపట్నం వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా గంజాయి రవాణా కాకుండా 24గంటలూ ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు మీసాల చిన్నమనాయుడు, ఇమ్మాన్యుయేల్ రాజు, పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

రణస్థలం: పైడిభీమవరంలోని మద్యం దుకాణం సమీపాన ఒక కాలువ వద్ద కె.బంగారప్పడు (25) అనే యువకుడు సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం ఒంపల్లి గ్రామానికి చెందిన బంగారప్పడు పైడిభీమవరంలోని ఒక పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అయితే గత మూడు రోజులుగా బంగారప్పడు ఇంటికి వెళ్లకుండా మద్యం తాగుతూ పరిసరాల్లోనే తిరుగుతున్నాడు. ఈ క్రమంలో ఏమైందోగాని సోమవారం తెల్లవారేసరికి కాలువ వద్ద శవమై కనిపించాడు. బంగారప్పడు ఒంటిపై గాయలు ఉండడంతో తన తమ్ముడిని ఎవరో చంపి ఇక్కడ పడేశారని ఆరోపిస్తూ అతడి అక్క గంగ కన్నీరు మున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న క్లూస్ టీమ్, జేఆర్ పురం సీఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బంగారప్పడు అక్క గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

టెక్కలి: టెక్కలి సచివాలయం-3లో పరిధిలో విధులు నిర్వహిస్తున్న సనపల సరస్వతి అనే ఆశ కార్యకర్త సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే స్థానికులు గమనించి స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆమె ఈ అఘాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎచ్చెర్ల: కుశాలపురం పరిధి నవభారత్ జంక్షన్ జాతీయ రహదారి పై ఓవర్ సర్వీసు రోడ్డులో సోమవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. శ్రీకాకుళం నుంచి ఎచ్చెర్ల వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒక మహిళ, మరో వ్యక్తి గాయపడ్డారు. గాయపడిన వారిద్దరూ శ్రీకాకుళం నగరానికి చెందిన వారు. వీరిని చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం

శ్రీకాకుళం క్రైం: పోలీసుశాఖలోని హోంగార్డు విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇటీవల మృతి చెందిన హోంగార్డు టి.కాంతారావు కుటుంబ సభ్యులకు సహచర హోంగార్డుల ఒక్కరోజు వేతనం రూ.4.13 లక్షల చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కాంతారావు కుటుంబ సభ్యులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకట రమణ తదితరులు ఉన్నారు.

జిల్లాలో 15 మంది ఎస్ఐలకు స్థానచలనం

- విశాఖ రేంజ్ పరిధిలో తొమ్మిది మంది సీఐలకు..

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో పనిచేస్తున్న 15 మంది ఎస్ఐలు, విశాఖ రేంజ్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ సోమవారం ఎస్పీ, నుంచి డీఐజీ కార్యాలయాల నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీఆర్‌లో ఉన్న ఎస్ఐ మరడాన హరికృష్ణను శ్రీకాకుళం వన్‌టౌన్ స్టేషన్‌కి, అనకాపల్లి సీసీఎస్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రెల్లి జనార్దనరావును గార పీఎస్‌కు, గార ఎస్ఐ కె.కృష్ణప్రసాద్‌ను శ్రీకాకుళం వీఆర్‌కి, వీఆర్‌లో ఉన్న గోగాడ నారాయణ స్వామిని నౌపాడ పీఎస్‌కు, నౌపాడ ఎస్ఐ పి.కిషోర్ వర్మను శ్రీకాకుళం వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న కూన నెమరబాబును శ్రీకాకుళం ఎస్‌బీ-1 ఎస్ఐగా, సరుబుజ్జిలి ఎస్ఐ బుడుమూరు నిహార్‌ని వజ్రపుకొత్తూరు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ చామంతుల రామారావును వీఆర్‌కి బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న పిన్నింటి రమేష్ బాబును మెళియాపుట్టి, మెళియాపుట్టిలో ఉన్న టి.రాజేష్‌ను వీఆర్‌కు, సీసీఎస్‌లో ఉన్న వెల్లిచెట్టి సందీప్ కుమార్‌ను ఎచ్చెర్ల పీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న వి.సత్యనారాయణను కోటబొమ్మాళి పీఎస్‌కు, కొటబొమ్మాళి ఎస్ఐ షేక్ మహ్మద్ ఆలీని నందిగాంకు, నందిగాం ఎస్ఐ అమీర్ ఆలీ మొహసీద్‌ను వీఆర్‌కి, ఏఎస్‌బీ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావును వీఆర్‌కి బదిలీ చేశారు. అలాగే విశాఖ రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న సీఐ వానపల్లి నాగరాజును శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు, వీఆర్‌లో ఉన్న మరో సీఐ జీఆర్‌కే తులసిదాస్‌ను శ్రీకాకుళం జిల్లా పోలీసు శిక్షణా కేంద్రానికి విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి బదిలీ చేశారు. అలాగే వీఆర్‌లో ఉన్న సీఐలు ఎంవీవీ రమణమూర్తిని విజయనగరం వీఆర్‌కి, ఎం.బుచ్చిరాజును అనకాపల్లి జిల్లా వీసీఆర్‌కి, జి.దుర్గా ప్రసాద్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా సోషల్ మీడియా సైబర్ సెల్‌కి, సువ్వారి రామునిఏఎస్ఆర్ జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్ ఫోర్స్‌కి, గంగుల గోవిందరావును నర్సీపట్నం, ఎస్‌కే గఫూర్‌ని అనకాపల్లి వీఆర్‌కి, నర్సీపట్నం టౌన్ సీఐ త్రిపురాన క్రాంతి కుమార్‌ని అనకాపల్లి జిల్లా వీఆర్‌కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు.

మహిళ మెడలోని గొలుసు చోరీ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ వివేకానంద, సీఐ ఉమామహేశ్వరరావు


శ్రీకాకుళం క్రైం: నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ఉన్న ఆర్‌కే నగర్ కాలనీలో నివసిస్తున్న జయలక్ష్మి అనే మహిళ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిన్నారు. సోమవారం రాత్రి 8 గంటలకు విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా కరెంట్ ఆఫీస్ సమీపంలో వెనక నుంచి ఓ వ్యక్తి మాస్క్ ధరించి ద్విచక్ర వాహనంపై వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసును తెంపుకొని వెళ్లిపోయాడు. దీంతో ఆ మహిళ రోడ్డుపై పడిపోవడంతో గాయాలు కాగా, దొంగ దొంగ అంటూ కేకలు వేయగా స్థానికులు అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుని పారిపోయాడు. బాధితురాలు 100కు ఫోన్ చేయడంతో డీఎస్పీ సీహెచ్ వివేకానంద, టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అలాగే చుట్టు పక్కల ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. కాగా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచె కట్టులోనూ.. కుంచె పట్టులోనూ!

- చిత్ర కళ ఆయన సొత్తు
- నేడు వడ్డాది పాపయ్య జయంతి


వడ్డాది పాపయ్య





వడ్డాది పాపయ్య గీచిన చిత్రాలు

ఎచ్చెర్ల: తెలుగు చిత్ర కళారంగంలో అందాల హరివిల్లుగా వెల్లివిరిసి.. మెరుపు వలే కనుమరుగైన కళాబ్రహ్మ వడ్డాది పాపయ్య (వ.పా). పురస్కారాలు, ప్రశంసల కోసం కొందరు బొమ్మలు గీయగా.. కళ కోసమే తపించి, కళాభిమానుల కోసమే చిత్రాలను గీసిన మహనీయుడు ఆయన. ఈయన శ్రీకాకుళం నగరంలో 1921 సెప్టెంబరు 10వ తేదీన జన్మించారు. ఆయన తండ్రి శ్రీరామ్మూర్తి వ్యాయామోపాధ్యాయుడిగా శ్రీకాకుళంలో పనిచేశారు. తండ్రి మార్గదర్శకంలో ఐదో ఏట హనుమంతుడి బొమ్మను గీసి చిత్రకళారంగంపై తన అభిరుచిని చాటారు. భారతీయ పురాణ, ఇతిహాసాలపై విద్యార్థి దశలోనే పట్టుసాధించి ఆ దిశగా తన చిత్రకళా ఆసక్తికి రంగులు, తన భావాలకు కుంచె ద్వారా మెరుగులు దిద్దుకున్నారు. రవివర్మ, దామెర్ల రామారావులను గురువులుగా భావించి పాపయ్య చిత్ర కళారంగంలో ముందడుగు వేశారు. ఆయన చిత్రకారుడుగా ఎంత గొప్పవాడో, వ్యక్తిగా అంత నిరాంబరుడు. సాదాసీదా తెల్లపంచె.. అదే రంగు లాల్చీ ధరించి తెలుగుదనం ఉట్టిపడేలా ఉండేవారు. అప్పట్లో ఈయన భారతిలో గీచిన నాగేశ్వరుడు, ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన రతీమన్మథ చిత్రాలు సంచలనం సృష్టించాయి. మంజూష, రేణాణి, అభిసారిక, అవినీతి, నవ్వు లు-పువ్వులు పత్రికల్లో ఈయన గీచిన చిత్రాలను చూసిన చక్రపాణి స్వాతి, చందమామ చిత్రకారుడిగా మద్రాసు ఆహ్వానించారు. రాగాలతో రోగాలు నయమవుతాయనే నమ్మే వ.పా శివరంజని, హిందోళ, కన్నడ, శహన, జయజయవంతి, అహిరభైరవ రాగాలకు భావయుక్త మైన చిత్రాలను గీశారు. ఆయన కుంచె నుంచి జాలువారని చిత్రం లేదంటే అతిశయోక్తి లేదు. పురణ పురుషులు, కావ్య నాయకులు, పల్లె పడుచులు, జాతీయ నాయకులు, వివిధ కాలాలు, రుతువులు, పండుగలు, ఆచార వ్యవహారాలు, జానపద విన్యాసాలు, రాగాలు, నదులు, ఊహా లోకాలు... ఇలా ఒకటేంటి మనిషి లోని, ప్రకృతిలోని అన్ని భావాలు, రూపాలను తన చిత్రాల ద్వారా చూపించారు. అందుకే ఆయన గీచిన చిత్రాల కోసం ఒకనాడు తెలుగు నేలపైన సామాన్యుడి నుంచి మేధావుల వరకూ అర్ధ శతాబ్దం పాటు ఎదురుచూశారు. నేటికీ అవి సజీవ చిత్రాలుగా నిలుస్తున్నాయి.

ఊపిరినిచ్చిన చిత్రాలు..

1940-90 వరకూ తెలుగు నేలపై ప్రచురితమైన పలు పత్రికలు, జర్నల్స్‌కు వ.పా గీచిన చిత్రాలు ఊపిరినిచ్చాయి. ఆయా పత్రికలు ప్రచురించే కథలు, నవలలకు ఆయన గీచిన చిత్రాలు ఎంతో ప్రాచుర్యాన్ని తెచ్చాయి. చిత్రకారుడిగానే కాకుండా కార్టూనిస్టుగా, బొమ్మల కథ రచయితగా బహుముఖ ప్రజ్ఞావంతుడు. 1940 దశకంలో చిన్నారులను ఆకట్టుకోవడానికి ఆయన బాల పత్రికలో గీచిన చిత్రాలు ఎంతో తమాషాగా, ఆహ్లాదంగా ఉండేవి. చిత్రాలతో పాటు యువ, ఆనందవాణి, నవ్వులు పువ్వులు తదితర పత్రికల్లో గీచిన వందలాది కార్టూన్లు తెలుగు వ్యంగ్య చిత్ర కళలకు ఉత్తేజాన్ని నింపాయి. చందమామ, కథా మంజూష తదితర పత్రికల్లో ఎన్నో కథలను రాశారు. శరత్‌చంద్ర నవలలకు ఆయన గీచిన బొమ్మలు నాటి పాఠకుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి.

నిరాడంబర జీవనం..

నిరాడంబరత, మానవతకు దగ్గరగా, ప్రచారానికి, ప్రశంసలకు దూరంగా ఉంటూ.. పంచె కట్టులోనూ, కుంచె పట్టులోనూ అసలు సిసలైన తెలుగువానికి నిలువుటద్దంగా నిలిచారు. తన మరణం ముందుగా ఊహించి అంతియ చిత్రం తన అనంతరం వెయ్యడం కోసం కాకుండా, ఉన్నప్పుడే చూసుకునేలా చరమ చిత్రం చిత్రించుకున్న మహాచిత్రకారుడు వ.పా. అది స్వాతి సపరివార పత్రికలో ప్రచురితమైంది. పత్రికలకు చిత్రాలు అందించే నిమిత్తం మద్రాసులో బిజీ జీవితాన్ని గడిపినప్పటికీ.. దాని నుంచి బయటపడి తనకు నచ్చిన జీవనయానంలో భాగంగా అనకాపల్లికి సమీపంలోని కశింకోటకు చేరుకున్నారు. అక్కడే శారదా నది ఒడ్డున వ.పా వనం (010) నిర్మించుకుని తన కుమార్తె కుటుంబంతో కలిసి చివరి రోజులు గడిపారు. 1992 డిసెంబరు 30న వ.పా తుదిశ్వాస విడిస్తే.. ఒక రోజు తర్వాత ఈ లోకానికి ఈ వార్త తెలిసింది.

పొగురు తీత పనులు చేపట్టండి


కవిటి: బీలబట్టి ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే, ఆర్డీవో

కవిటి/కంచిలి/సోంపేట: ఉద్దానం ప్రాంతంలో రెండు రోజులుగా కురిసిన బారీ వర్షాలకు బీలబట్టి సమీపంలోని వరిపొలాల్లో వరదనీరు చేరింది. కవిటి, ఇద్దివానిపాలెం గ్రామాల వద్ద పొగురుతీత పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఆర్డీవో భరత్‌నాయక్ ఆదేశించారు. సోమవారం కవిటి, కంచిలి, సోంపేట తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయా మండలాల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద నీరు నిల్వ లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో పర్యటించారు. వరి పొలాలకు బీలబట్టి ప్రాంతంతో పాటు పుటియాదల రెవెన్యూ పరిధిలోని రంగాలగెడ్డ వరదనీటిని పుక్కళ్లపాలెం వద్ద సముద్రంలో కలిపేందుకు పొగురుతీత చేపట్టాలని సూచించారు. అనంతరం ఇద్దివానిపాలెం గ్రామం వద్ద బీలబట్టి వరద పరిస్థితిని ఎమ్మెల్యే అశోక్, అధికారులు పరిశీలించారు. ఇద్దివానిపాలెంలో పారిశుధ్యం మెరుగుపర్చి, ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించాలని అధికారులను సూచించారు. కంచిలి తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపీడీవో వి.నీరజ, ఏవో ధనుంజయ, సోంపేట తహసీల్దార్ అప్పలస్వామి, నాయకులు సూరాడ చంద్రమోహన్, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ఆప్సా సాయం


వరద బాధితులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అరసవల్లి/ పోలాకి: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆప్సా ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆప్సా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో విజయవాడలోని పలు ముంపు ప్రాంతాల్లో వరద బాధితులకు దుప్పట్లు, ఆహార పదార్థాలు, నిత్యావసరాలతో కూడిన 1000 కిట్లను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులను మంత్రితోపాటు నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మెట్ట జనార్దనరావు, ఇలపండ గణపతిరావు, ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తి భావంతో వినాయక నిమజ్జనం చేసుకోవాలి

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో తీవ్ర వర్షాల కారణంగా నదులు, వాగులు ఉపొంగి పొర్లుతున్న నేపథ్యంలో వినాయక నిమజ్జనాల్లో ఎటువంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సబ్ డివిజన్ పరిధిలో గుర్తించిన 21 నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. ఈ మేరకు తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో 1055 వినాయక మండపాలకు దరఖాస్తులు రాగా వాటికి అనుమతులు ఇచ్చామన్నారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో 21 నిమజ్జన ప్రాంతాల్లో 8 మంది ఎస్ఐలు, 70 మంది హెచ్‌సీలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. శ్రీకాకుళం నగరంలో పొన్నాడ, గురాలీపేట, డేఅండ్‌నైట్ వద్ద నాగావళి నదితో పాటు పెద్దపాడు రోడ్డులో రామిగెడ్డ వద్ద వినియక నిమజ్జనాలకు అనుమతిచ్చామన్నారు. అరసవిల్లి చెరువు, సింగుపురం చెరువుతో పాటు గారలో తంగిళ్లపేట, బందరువానిపేట బీచ్‌లో రెండు ప్రాంతాలు, గాబువానిపేట ట్యాంకు, జేఆర్ పురం, లావేరు, ఆమదాలవలసలో చీమలవలస, మందలి చెరువు, దివానిపేట చెరువు, కోరటాం మంగళి చెరువు, కృష్ణాపురం ట్యాంకు, తొగరాంలోని నాగావళి నది, పొందూరులోని ధర్మవరం, దళ్లవలస, పెనుబర్తి, సరుబుజ్జిలిలో పాలవలస, బొర్రంపేట ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వినాయక నిమజ్జనాలు సాయంత్రం 5నుంచి రాత్రి 9 గంటల లోపు పూర్తి చేయాలని, మద్యం తాగి ఊరేగింపులు చేపడితే డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలంతా భక్తి భావంతో వినాయక నిమజ్జనం చేసుకోవాలని డీఎస్పీ ప్రజలను కోరారు.

అల్లర్లకు పాల్పడితే సహించేది లేదు

లావేరు: వినాయక నిమజనాల్లో ఎక్కడైనా అల్లర్లు చేస్తే సహించేది లేదని ఎస్ఐ జి.లక్ష్మణరావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలోనే వినాయక నిమజ్జనాలు చేపట్టాలన్నారు. చిన్నపిల్లలను నిమజ్జనాలకు తీసుకుని వెళ్లొద్దని సూచించారు. అందరూ స్నేహ పూర్వకమైన వాతావరణంలోనే నిమజ్జనాలు చేపట్టాలన్నారు.

వరద బాధితులకు ఎంజీఆర్ రూ.10లక్షల విరాళం


చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం/ కొత్తూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు రూ.10 లక్షల విరాళం అందించారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబు నాయుడును కలిసి విరాళం చెక్కును అందజేశారు. సీఎం చంద్రబాబు చిత్తశుద్ధితో బాధితులను ఆదుకు నేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని ఎంజీఆర్ అన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

పంట నష్టం అంచనా వేయండి

ఇచ్ఛాపురం: అకాల వర్షాలతో మండలంలో జరిగిన నష్టాలను గుర్తించి అంచనాలు పంపించాలని జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురిసిన భారీ వర్షాలకు ఎంత ఆస్తినష్టం, పంట నష్టం, ఇళ్ల డేమేజ్ ఎంత మేరకు జరిగిందో క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను అందజేయాలని తెలిపారు. అనంతరం బాహుదా నది వరద పరిస్థితిని పరిశీలించారు. అలాగే డొంకూరు గ్రామంలో వర్షాలు పరిస్థితి పరిశీలించి తుఫాన్ షెల్టర్ వద్ద గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ వెంకటరావు, డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ మీసాల చిన్నమనాయుడు, ఎస్ఐలు చిన్నమనాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మహాలడ్డూ.. రూ.2.25 లక్షలు



శ్రీకాకుళం కల్చరల్: మొండేటి వీధిలో గల లక్ష్మీ గణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన మహా లడ్డూ వేలం సోమవారం నిర్వహించారు. ఈ వేలంలో లడ్డూను రూ.2.25 లక్షలకు ఎస్.శ్రీనివాసరావు, బలభద్రుని కుమార్, కోరాడ గోవింద్, శిల్లా ఉపేంద్ర, కర్రా భాస్కరరావు, మహేశ్వరరావు, శిల్లా చందు, జామి నవీన్, మండవల్లి రవి, కర్రా మధుసూదనరావు, కోరాడ శంకర్, అంధవరపు నగేష్, కర్రా రవికుమార్, గుడ్ల కిషోర్, బాలాజీ చౌదరి, అంధవరపు మణికంఠ, అంధవరపు సంతోష్, గుడ్ల అనిల్‌కుమార్ సంయుక్తంగా లడ్డూను దక్కించుకున్నారు. అలాగే స్వామివారికి అలంకరించిన పగడాల హారాన్ని నారాయణశెట్టి కిరణ్‌కుమార్ రూ.40వేలకు, ముత్యాల హారాన్ని రూ.36వేలకు పి.గణేష్, ఎస్.సుధీర్, కె.రవి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం


గండి పడిన రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్ట పోయిన రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. సోమవారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. పంట పొలాలను, గండ్లు పడిన రోడ్లును పరిశీలించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. టీడీపీ నేతలు పిసిని జగన్నాథంనాయుడు, పిన్నింటి భానూజీనాయుడు, తదితరులు ఉన్నారు.

పంట పొలాల్లోని నీరు తొలగించాలి

శ్రీకాకుళం రూరల్: మునిగిన పంట పొలాల్లో నీటిని వెంటనే తొలగించే పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని రూరల్ మండల ప్రత్యేకాధికారి, జడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శానివాడ, పెద్దపాడు, అలికాం, కంచుమల్లయ్యపేట గ్రామాల్లో సోమవారం తహసీల్దార్ గణపతిరావుతో కలిసి ఆయన పర్యటించి ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనా వేసి పంపించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పొన్నాంలో తెగిన నది గట్టును ఇరిగేషన్ అధికారులు నిర్మిస్తుండగా ఆ పనులను ఆర్డీవో సీహెచ్ రంగయ్య, తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమ సారధి చంద్రబాబు


మాట్లాడుతున్న కలమట వెంకటరమణ

కొత్తూరు: అభివృద్ధి, సంక్షేమ సారధి సీఎం చంద్రబాబు అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ అన్నారు. మెట్టూరు జంక్షన్ టీడీపీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా నాయకుడు చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేసి ఏడాది అయిందని, ఇది చీకటి రోజన్నారు. జగన్‌రెడ్డి అరాచక పాలనకు ప్రజలు బుద్ధి చెప్పి 11 సీట్లకు పరిమితం చేశారన్నారు. సమావేశంలో కొత్తూరు మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


సమీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

పొందూరు: అల్పపీడనం కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలానికి వరద ముప్పు పొంచి ఉండడంతో అధికారులను అప్రమత్తం చేశామని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. వర్షాలు, వరదలపై మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో సోమవారం అధికారులు, నాయకులతో సమీక్షించారు. ముఖ్యంగా రెల్లిగెడ్డ ప్రభావిత గ్రామాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి ముంపులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెల్లిగెడ్డపై ఉన్న వంతెన వద్ద, రైల్వే అండర్ ప్యాసేజ్ బ్రిడ్జిల వద్ద ముందస్తు భద్రతలో భాగంగా సచివాలయ సిబ్బందిని, పోలీసులను నియమించామన్నారు. సమీక్షలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో హరిహరరావు, నాయకులు ఎ.రాము, బి.శంకరభాస్కర్, ఎ.చినరంగ, బి.గిరి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ నైపుణ్యాభివృద్ధి మహిళా సాధికార కేంద్రం (మహిళా ప్రాంగణం)లో ఉద్యోగ, ఉపాధి నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా మేనేజర్ కె.పార్వతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, టైలరింగ్, మగ్గం వర్క్ కోర్సుల్లో ప్రవేశాలకు 18-40 ఏళ్లలోపు వయసు గల మహిళలు ఈ నెల 14వ తేదీలోగా దరఖాస్తు చేయాలన్నారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్సులో ప్రవేశానికి పదో తరగతి ఉత్తీర్ణత, టైలరింగ్, మగ్గంవర్క్ కోర్సుల్లో ప్రవేశానికి 8వ తరగతి చదివిన మహిళలు అర్హులన్నారు. ఈ శిక్షణలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 83339 21337, 99485 30183, 74167 64419 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అంధకారంలో గ్రామాలు

కవిటి: బొరివంక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయి గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. రెండు రోజులుగా తీరప్రాంత గ్రామాలతోపాటు బొరివంక, బి.గొనపపుట్టుగ, వరక, కుసుంపురం, మాణిక్యపురం, బల్లిపుట్టుగ పంచాయతీల పరిధిలో గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. వాయుగుండం ప్రభావంతో వర్షాలు కురుస్తుంటే మరోవైపు విద్యుత్ సరఫరా లేక ప్రజలు అల్లాడిపోయారు. ఇదే విషయాన్ని విద్యుత్ ఆపరేషన్ డీఈ సురేష్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైం దని, దాంతో విద్యుత్ అంతరాయం ఏర్పడిందన్నారు. త్వరితగతిన సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న జానపద కళా ప్రదర్శన


జానపద ప్రదర్శన ఇస్తున్న అసిరయ్య

వజ్రపుకొత్తూరు: అనంతగిరి గ్రామం గొల్లవీధిలో సోమవారం రాత్రి ప్రముఖ జానపద కళాకారుడు బోనెల అసిరయ్య, సినీనటుడు అమ్మ రామకృష్ణ కళా ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా రైతులు, గొర్రెల కాపరులు అంతరించి పోతున్న పల్లె పాటల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అసిరయ్య తనదైన ప్రత్యేకతతో గ్రామస్థులను అలరించారు. అనంతరం ఆయనను కమిటీ సభ్యులు సత్కరించారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

జి.సిగడాం: వరదప్రభావిత ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి టి.రాజేంద్ర ప్రసాద్‌బాబు అన్నారు. సోమవారం పెనసాం, నిద్దాం, గంగన్నదొరపాలెం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుపాన్ కారణంగా కోతకు గురైన రహదారులు, గండి కొట్టిన చెరువులు, గెడ్డలు, వాగులను ఆయన పరిశీలించారు. నిద్దాం రెల్లిగెడ్డ వద్ద పరిస్థితిని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ పరిశీలించారు. ఎంపీడీవో కె.నిశ్చల, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్వో, డీఏ, సర్పంచ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

జి.సిగడాం: టీడీ వలస గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సాసుబిల్లి గోపాలనాయుడు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్ సోమవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు బోగాది అప్పలనాయుడు, నక్క మురళి, గొల్లాజీ, కోన వెంకటరావు, మజ్జి కన్నంనాయుడు తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి

బూర్జ: మండలంలోని ఓవీ పేట గ్రామంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు విజ్ఞప్తి చేసినట్టు వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. బూర్జలో జరిగిన సర్వసభ్య సమావేశం సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్‌కు సూర్యారావుకు వినతిపత్రం అందించారు. షట్టర్లు, రిటర్నింగ్ వాల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్సీ కాలనీకి మినీ వాటర్ ట్యాంక్, కొత్తగెడ్డ, పాత గెడ్డలపై బ్రిడ్జిలు మంజూరు చేసి రహదారి పునరుద్ధరించాలని కోరారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

కంచిలి: భారీ వర్షాలు కారణంగా కంచిలి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మండల ప్రత్యేకాధికారి జి.రఘునాథ్ పరిశీలించారు. బైరిపురం జంక్షన్ వద్ద వరద నీరు రోడ్డుపై నిలిచి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. నారాయణబట్టి గ్రామం వద్ద రహదారిపై వరదనీటిని పరిశీలించేలా చర్యలు చేపట్టారు. బూరగాం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.